
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 31 డిసెంబర్ 2023
5
తిరుపతి



'సమ్మె'... సై'రన్'..!

ప్రజాదృష్టి



ప్రజాశక్తి-తిరుపతి సిటి

రాష్ట్రంలో సమ్మె సైరన్ మోగింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు రంగాల్లో పని చేస్తున్న కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రోడ్డెక్కారు. శాంతియుత పద్ధతుల్లో వినూత్న రీతిలో తమ నిరసనను తెలియజేస్తూ ప్రభుత్వం స్పందించాలని నినదిస్తున్నారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కోసం పోరుడుతున్న కార్మికులను ఓదార్చి, భరోసా ఇవ్వాల్సిన పాలకులు బెదిరింపులకు దిగుతుండడం గమనార్హం.

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో స్వల్ప వేతనాలతో బతుకులీడుస్తున్న అంగన్‌వాడీ, మున్సిపల్, గ్రామ/వార్డు సచివాలయ వాలంటీర్లు, సమగ్ర శిక్ష తరదితర రంగాల్లోని చిరుద్యోగులు ఆందోళనబాట పట్టడంతో ఊపిరాడని ప్రభుత్వం అందులోంచి బయటపడేందుకు అవాస్తవాలను ప్రచారం చేసేందుకు పూనుకుంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీలు 20 రోజులుగా సమ్మె చేస్తున్నారు. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీలకు చెందిన వర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్లు ఈ సమ్మెలో పాల్గొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ కంటే అదనంగా వేతనం ఇవ్వాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలి. రిటైర్మెంట్ బెనిఫిట్ 5 లక్షలు ఇవ్వాలి. వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలి అనేవి ప్రధాన డిమాండ్లు. దీంతో వారిని బెదిరించేందుకు ప్రభుత్వం పూనుకుంది. 2019లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వెయ్యి రూపాయలు వేతనం పెంచామని, తెలంగాణ పెంచిన ప్రతి సారి ఆంధ్రప్రదేశ్‌లోనూ పెంచుతామని తామేమి హామీ ఇవ్వలేదని సాక్షాత్తు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించడం శోచనీయం.

ఇంకో పక్క తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెకు దిగారు. ఐదు రోజులుగా జిల్లా వ్యాప్తంగా సమ్మెను ఉధృతం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు తమ నిరసన గళం వినిపించారు. మెడకు ఉరితాళ్లు వేసుకుని వినూత్నరీతిన నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం పోటీ కార్మికులను రంగంలోకి దిపండం గమనార్హం. దీంతో ఈ నెల 31 నుంచి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, మంచినీరు, కరెంట్‌తో సహా అన్ని సేవను బంద్ చేస్తామని కార్మిక సంఘాలు ప్రభుత్వాన్ని హెచ్చరించాయి.

మరోపక్క సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపడుతున్నారు. జిల్లాలో వీరి సమ్మె శనివారంతో 11వ రోజుకు చేరుకుంది. తమకు హెచ్‌ఆర్ పాలసీ ప్రకటించాలని, సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని, మినిమం టైం స్కేల్ ఇవ్వాలని, తదితర డిమాండ్లతో వినూత్న రీతిలో బిక్షాటన, మానవహారం, వంటావార్పు చేపడుతూ జాతీయ నాయకుల విగ్రహాలకు వినతిపత్రాలు అందించారు. వీరి నిరసనపై స్పందించి న్యాయం చేయాల్సిన ఎస్ఎస్ఏ అధికారులు ఏకంగా షోకాజ్ నోటీసులు జారీ చేయడం బాధాకరం.

ఇంక పక్క వాలంటీర్లు సమస్యల పరిష్కారానికి నిరసన తెలియజేస్తే ఉద్యోగాల నుంచి తొలగించడం హేయమైన చర్య అని, తొలగించిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకోవాలని డిమాండు చేశారు. లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మరోపక్క విఆర్‌వోలు, ఆశా వర్కర్లు, టిటిడి అటవీ కార్మికులు నిరసన దీక్షలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రంగాల్లోని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆందోళన బాట పడుతున్నారు. నిరసన తెలిజేస్తున్న కార్మికులు రాజకీయ పార్టీలు సిపిఎం, సిపిఐ, ఐఎఫ్‌టియు, కాంగ్రెస్, జనసేన, టిడిపి, ఆఫ్, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల, మహిళా సంఘాలు సంపూర్ణ మద్దతు తెలియజేవాయి. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు స్పందించి కార్మికులకు న్యాయమైన కోర్కెలు తీర్చాలని పలువురు మేధావులు కోరుతున్నారు. కొసమెరుపు ఏమంటే సమ్మె చేస్తున్నది ఎందుకంటే జగనన్న అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మాత్రమే.



తిరుపతిలో పెద్దిరెడ్డిని ఇంటిని ముట్టడించనీకుండా రోడ్డుపైనే నిలిపేసిన పోలీసులు

జగన్మోహన్‌రెడ్డికి అధోగతే..!

- మంత్రుల ఇళ్లను ముట్టడించిన అంగన్‌వాడీలు
- భారీగా మోహరించి అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే సిఎం జగన్మోహన్‌రెడ్డికి అధోగతి తప్పదని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి హెచ్చరించారు. అంగన్‌వాడీల సమ్మె శనివారానికి 19వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర యూనియన్ల పిలుపులో భాగంగా మంత్రి పెద్దిరెడ్డి నివాసాన్ని ముట్టడించేందుకు అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పెద్దఎత్తున పూలే విగ్రహ వద్దకు శనివారం చేరుకున్నారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ అంగన్‌వాడీలు ప్రదర్శనగా ఎంఆర్‌పల్లికూడలి వద్దకు చేరుకున్నారు. పోలీసులు మంత్రి ఇంటివైపు వెళ్లనీకుండా అడ్డుకోవడంతో అంగన్‌వాడీలు రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్‌టియు నేతలు కందారపు మురళి, కేతం రాధాక్రిష్ణ, ఆర్.హరిక్రిష్ణ ప్రసంగించారు. తక్షణం సమస్యలు పరిష్కరించకుంటే సిఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. జనవరి 3న నూతన సంవత్సరంలో కలెక్టరేట్లను ముట్టడిస్తామన్నారు. ముట్టడి కార్యక్రమం ఉదయం 11 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం రెండు గంటల వరకు జరిగింది. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు యస్ వాణిశ్రీ, భారతి, నాగరాజమ్మలు అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, అంగన్వాడీ గౌరవాధ్యక్షులు కేఎస్ఎన్ ప్రసాదరావు, సిఐటియు నేతలు వందవాసి నాగరాజు, టి. సుబ్రహ్మణ్యం, కె. వేణుగోపాల్, గురవయ్య, వడ్డిపల్లి చెంగయ్య, ఆర్. లక్ష్మి, బుజ్జి, చిన్నా, బాలాజీ గంగులప్ప, మునిరాజ, ధనమ్మ భాగ్యమ్మ, రేవతి, సౌజన్య, మంజుల, నాగభూషణమ్మ, సుశీల, ఎస్ డి రవి జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల నుంచి వచ్చిన అంగన్వాడీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- గూడూరు టౌన్‌లో అంగన్‌వాడీ అధ్యక్షురాలు ఇంద్రావతి, కార్యదర్శి ప్రభావతి, సిఐటియు నాయకులు సురేష్ ఆధ్వర్యంలో సమ్మె కొనసాగింది.
- పుత్తూరు టౌన్‌లో అంబేద్కర్ సర్కిల్ నుంచి డిప్యూటీ సిఎం నారాయణస్వామి ఇంటివరకూ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు డి.జనార్ధన్, ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించేంత వరకూ పోరాటం ఆగదన్నారు. జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల బటన్ నొక్కుతున్నారని, వచ్చే ఎన్నికల్లో తమ దగ్గరకు బటన్ వస్తుందని, అప్పుడు బటన్ నొక్కి ఇంటికి పంపిస్తామన్నారు. ఇప్పటికైనా అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు మునికుమారి, విజయ్‌కుమారి, ఇంద్రాణి, నిర్మల, శాంతి, డి.మహేష్, రమేష్, పురుషోత్తం పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో బెదిరింపులు

మున్సిపల్ కార్మికుల భారీ ర్యాలీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్

కాంట్రాక్ట్ మున్సిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని నాయకులు పట్టు బిగిస్తున్నారు. గూడూరు పట్టణంలోనీ కాంటాక్ట్ మున్సిపల్ వర్కర్లు పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు . ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో కాంటాక్ట్ మున్సిపల్ వర్కర్లకు హామీలు ఇచ్చి వారి ఓట్లు పొంది అధికారంలోకి వచ్చారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ కాలపరిమితి ముగుస్తున్నా పట్టించుకోకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమే గాక, మోసపూరితంగా వ్యవహరించారన్నారు. ఈ ర్యాలీలో నాయకులు జోగి శివకుమార్, బివి రమణయ్య, సంపూర్ణమ్మ, మున్సిపల్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు బి.రమేష్, ధారా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

- సూళ్లూరుపేటలో మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్, చైర్‌పర్సన్ శ్రీమంతరెడ్డి కార్మిక నాయకులతో చర్చలు జరిపారు. ప్రైవేట్ కార్మికులతో పని చేయించుకుంటామని హెచ్చరించారు. నూతన సంవత్సరం సందర్భంగా కొంతమంది కార్మికులను కేటాయించడమో, లేదంటే ఇతర కార్మికుల దగ్గర పనిచేయించుకుంటే వాళ్లని ఇబ్బంది పెట్టకూడదని అన్నారు. యూనియన్ నాయకులు స్పందిస్తూ ఇప్పటికే కొంతమంది రాజకీయ నాయకులు, అధికారుల ఇళ్లల్లో పనిచేస్తున్న వారిని సమ్మెలోకి రమ్మని కోరడం లేదన్నారు. అలాగే వాటర్, కరెంట్ వాళ్ల విధుల్లో వెసులుబాటు ఉన్నప్పుడే వచ్చి సంఘీభావం తెలియజేస్తున్నారన్నారు. డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమ్మెలో సిఐటియు నాయకులు కె.సాంబశివయ్య, బి.పద్మనాభయ్య, సుంకర అల్లెయ్య, కె.లక్ష్మయ్య పాల్గొన్నారు.
- నాయుడుపేటలో నిరవధిక సమ్మె ఐదో రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం వద్ద ఒంటి కాలుతో వినూత్న నిరసన తెలిపారు. జిల్లా నాయకులు శివకవి ముకుంద, చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మెతో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. చర్చలు జరిపి సమ్మె విరమించేలా చూడాలన్నారు. యూనియన్ నాయకులు నెలవల మస్తానయ్య, శ్రీనివాసులు, నాగరాజు, లీలామోహన్ పాల్గొన్నారు.



గూడూరులో భారీ ర్యాలీ

సంబరాలు సరే... జర జాగ్రత్త..!

న్యూ ఇయర్ వేడుకలపై ఎస్పీ హెచ్చరికలు
రాత్రిపూట శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ మూసివేత

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని డిసెంబర్ 31వ తేదీ రాత్రి సంబరాలు, వేడుకలు చేసుకోవడం అలవాటు.. యువత ఒకడుగు ముందుకు వేసి ఇటీవల అర్ధరాత్రుల్లో రోడ్లపైనే కేకులు కట్‌చేసి పుట్టినరోజులు, న్యూఇయర్, క్రిస్మస్ వేడుకలు చేసుకోవడం పరిపాటయ్యింది. కానీ ఏమాత్రం అజాగ్రత్త వహించిన ఇబ్బందులు తప్పవు. తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండి, వారి జీవితాలు ఇబ్బందుల పాలు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యతఉంది. సంబరాల సందర్భంగా యువత ప్రమాదాల బారిన పడకుండా పోలీసులు సైతం కొన్ని నిబంధనలు అమలు చేయనున్నారు.

డిసెంబర్ 31 రాత్రి పిల్లలు, పెద్దలు, మహిళలు అందరూ కొత్త సంవత్సర సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీ. అర్ధరాత్రి 12 గంటల వరకు మేల్కొని, జనవరి ఒకటో తేదీ ప్రవేశించగానే, కేకులు కట్ చేసి, టపాకాయలు కాల్చి, శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ వేడుకలు చేసుకుంటారు. మహా మహా నగరాల్లో, పట్టణాల్లో యువత మరో అడుగు ముందుకేసి బైపాస్ రోడ్ లో, ఫ్లై ఓవర్లలో, ప్రధాన కూడళ్లో, నడిరోడ్డుపై కేకులు కట్ చేసుకుని సంబరాలు చేసుకుంటారు. కొంతమంది యువత బైక్ రేసులను పెట్టుకుని ప్రమాదాలు బారిన పడి ప్రాణాపాస్థితిని కొని తెచ్చుకుంటారు. వేడుకలు జరుపుకున్నంత వరకు సరే. ప్రమాదాలు కొని తెచ్చుకోవడం సరైనది కాదు. ఎక్కువమంది మద్యం సేవించి, మత్తు పదార్థాలు సేవించి, వాహనాలు నడుపుతూ, వారితోపాటు ఇతరులను ఇబ్బందులకు గురి చేస్తుంటారు. ఇలాంటి వాటికి ఫుల్ స్టాప్ పెట్టాల్సిన పెద్దలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరైనది కాదు. కొన్ని హోటళ్లలో, ఫంక్షన్ హాలల్లో ప్రత్యేక సంబరాలు నిర్వహిస్తుంటారు. ప్రత్యేక ఆఫర్లతో యువతను ఆకట్టుకుంటారు. కొత్త సంవత్సరం సందర్భంగా సంబరాలు చేసుకునే యువత జాగ్రత్తగా ఉండాలని పలువురు పెద్దలు హెచ్చరిస్తున్నారు. వీటన్నిటిని దష్టిలో పెట్టుకొని పోలీసులు సైతం నిబంధనలు అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు. కొత్త సంవత్సరం సంబరాలు నిర్వహించే హెూటల్లు ఫంక్షన్ హాల్ లో ప్రైవేట్ స్థలాలు క్లబ్బులు నిర్వాహకులు ముందుగానే అనుమతి మంజూరు కోసం ఎస్పీకి దరఖాస్తు చేసుకోవాలి, అనుమతి ఉంటేనే సంబరాలు నిర్వహించాలి. నిర్వాహకులు కచ్చితంగా సి సి టీవీలు ఏర్పాటు చేయాలి. భద్రతకి అవసరమైన సిబ్బందిని వారే నియమించుకోవాలి. డీజే స్పీకర్స్ శబ్దాలు 45 డేసి బెల్కి మించరాదు. కార్యక్రమాల వద్ద ఎలాంటి బాణసంచా పేలుడు పదార్థాలు అనుమతించరాదు. బార్లు క్లబ్బులలో ప్రత్యేకంగా దంపతులు జంటల కోసం నిర్వహించే కార్యక్రమంలో మైనర్లు ను అనుమతించరాదు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నిర్వహకులు పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం అనుమతించిన సమయం వరకు మాత్రమే మద్యాన్ని అందించాలి. అగ్నిమాపక శాఖ వారి నిబంధన తప్పక పాటించాలి. విదేశీయులు ఎవరైనా ఉంటే హాజరైన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. తాగి డ్రైవింగ్ నడపకూడదు. మైనర్లు వాహనాలు నడపకూడదు. బహిరంగ ప్రదేశాల్లో ఎలాంటి కార్యక్రమాలకూ అనుమతి లేదు. డిసెంబర్ 31 రాత్రి భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సంబరాలకు హాజరయ్య ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకొని రాబోయే కొత్త సంవత్సరాన్ని ఆనందంగా నిర్వహించుకోవాలి. లేనిచో ప్రమాదాలు ఇబ్బందులు తప్పవు తస్మాత్ జాగ్రత్త....

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు : ఎస్పి

నూతన సంవత్సరం సందర్భంగా సంబరాలు జరుపుకోవడం సరే. నిబంధనలను పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా డిసెంబర్ 31వ తేదీ , బహిరంగ ప్రదేశాల్లో ఎలాంటి వేడుకలు అనుమతించరాదన్నారు. 31వ తేదీ రాత్రి తిరుపతిలోని శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ మూసివేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.



కుప్పంలో చంద్రబాబుతో జనసేన నేతలు

అభివృద్ధి బాధ్యత టిడిపి, జనసేనదే

కుప్పం పర్యటనలో నారా చంద్రబాబు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అంధకారంలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేది టిడిపి, జనసేనేనని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు అన్నారు. కుప్పంలో శనివారం జనసేన నేతలతో సమావేశమయ్యారు. అంతకు ముందు ఆయనకు ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్టీ రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులతో పాటు నియోజకవర్గ ఇన్ చార్జ్ లు, పాయింట్ ఆఫ్ కాంటాక్ట్స్, మండల అధ్యక్షులను చంద్రబాబుకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీల నాయకులు అన్నదమ్ముల్లా కలిసి మెలసి రాష్ట్రంలో ప్రభుత్వ మార్పుకు అహర్నిశలు శ్రమించాలని పిలుపునిచ్చారు. కుప్పంకు ఇంతమంది జనసేన నాయకులు రావడం, సమావేశ మందిరం జనసేన కేడర్ తో కిక్కిరిసి పోవడం చూసి ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్‌ను అభినందించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రాన్ని, ప్రజలను గెలిపించాలన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్న 14 నియోజకవర్గాల్లో అన్నింటినీ కైవసం చేసుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రానికి అనుభవం ఉన్న చంద్రబాబు, ఆశయం ఉన్న పవన్ కళ్యాణ్ ఇద్దరూ ఏకమయ్యారని, ఇద్దరి సారధ్యంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. ప్రశ్నించే నైజం కలిగిన తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఎన్నో సమస్యలను ప్రశ్నించే పరిష్కరించేలా చేశారన్నారు. ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్య, విశాఖ ఉక్కు సమస్య, అన్నమయ్య బాధితుల పక్షాన పోరాడటం, కౌలు రైతులకు సొంత నిధులను అందించడం ఇవన్నీ ఆశయంతోనే చేశారన్నారు. అలాగే ఎన్నో పరిశ్రమలు తీసుకువచ్చిన అనుభవం కలిగిన చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ల కలయిక రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదన్నారు. ధనం, దౌర్జన్యం, దొంగ ఓట్లతో గద్దెనెక్కాలనుకుంటున్న జగన్ మోహన్ రెడ్డిని ఇంటికి సాగనంపాలని కోరారు.

నేడు చివరి అవకాశం : కమిషనర్

తిరుపతి టౌన్ : 2023-24 రెండో అర్ధ సంవత్సరానికి వడ్డీ లేకుండా పన్ను చెల్లింపుకి 31 వ తేది ఆదివారం చివరి రోజు అని, నేడుకౌంటర్లు పని చేస్తాయని, ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా పన్ను చెల్లించడానికి నాలుగు ప్రత్యేక క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు.

పండుగ వాతావరణంలో సంక్షేమ ఫలాలు : కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

కొత్త సంవత్సరంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను లబ్దిదారులకు పండుగ వాతావరణంలో పంపిణీ చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కషి చేసి విజయవంతం చేయాలనీ కలెక్టర్ కే వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి అన్ని మండలాల ఎంపిడిఓ లు, మునిసిపల్ కమీషనర్ లు, నియోజక వర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులతో వర్చువల్ విధానంలో సమావేశమై దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశానుసారం రానున్న ఏడాది జనవరి నెలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న కార్యక్రమాల నిర్వహణపై ప్రజల్లో అవగాహన పెంచేలా ప్రచారం చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పంపిణీ కార్యక్రమం.. గ్రామ సచివాలయాల నుండి జిల్లా స్థాయి వరకు.. పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాలకు సంబంధించి ఒక షెడ్యూల్ రూపొందించుకొని ముందుకు వెళ్లాలన్నారు. జనవరి ఒకటో తేదీ నుంచి 8వ తేదీ వరకు వైఎస్సార్ పెన్షన్ కానుక కింద కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జనవరి 23వ తేదీన వైఎస్సార్ ఆసరా కార్యక్రమం, ఫిబ్రవరి 5వ తేదీన వైఎస్సార్ చేయూత పథకం ప్రారంభించడం జరుగుతుందని, చేయూత కింద 5 నుంచి 14వ తేదీ వరకు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి జ్యోతి, మెప్మా పిడి రాధమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమ, బిసి సంక్షేమ అధికారులు చెన్నయ్య, భాస్కర్ నాయుడు, డిప్యూటీ సీఈవో జడ్పీ ఆడిసేశారెడ్డి, డిఎల్డిఓ లు సుశీలా దేవి,వాణి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమనాయుడు కుంట చరిత్రను రాయించండి : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ తిరుపతి చెన్నారెడ్డి కాలనీలో ఆధునికరిస్తున్న కృష్ణమనాయుడు కుంట చరిత్రను ప్రజలకు తెలిసేలా బోర్డుపై రాయించాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఏఎస్ ఆదేశాలు జారీ చేసారు. కృష్ణమనాయుడు కుంట పనులను శనివారం కమిషనర్ హరిత ఐఏఎస్ పరిశీలించారు. 1 కోటి 38 లక్షలతో పనులను చేపట్టామన్నారు. ఆమెతో పాటు మునిసిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి ఉన్నారు.

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ 'దుర్గంధం వెదజల్లుతున్న స్విమ్స్ రోడ్డు' అనే శీర్షికన శనివారం 'ప్రజాశక్తి'లో వార్త ప్రచురితమయ్యింది. స్విమ్స్ డైరెక్టర్ ఛాంబర్ ముందున్న రోడ్డు మొత్తం డ్రైనేజితో దుర్వాసన వస్తుండేది. రెండు రోజుల పాటు రోగులకు, వైద్యులకు, సిబ్బందికి ఇబ్బందులు తప్పలేదు. శనివారం సిబ్బంది స్పందించి మురికినీటిని దారి మళ్లించి రోడ్డుపై రాకుండా చేసి, బ్లీచింగ్ పిచికారీ చేశారు. దీంతో అటు రోగులు, సహాయకులు, వైద్యులు ఊపిరి పీల్చుకున్నారు.



మురుగునీరు శుభ్రం చేసి బ్లీచింగ్ పిచికారీ

స్విమ్స్‌లో కార్మిక సమస్యలు పరిష్కరిస్తాం : డైరెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

స్విమ్స్ ఆసుపత్రిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచుతామని, వేధింపులకు గురి చేసే పద్ధతులను ఏమాత్రం సహించేది లేదని, కాంట్రాక్టు కార్మికులు తమ కుటుంబంలో భాగమేనని, తొలగించిన కార్మికులందరినీ ఉద్యోగాల్లోకి తీసుకుంటామని స్విమ్స్ ఆసుపత్రి డైరెక్టర్ ఆర్వి కుమార్ ప్రకటించారు. శనివారం ఉదయం స్విమ్స్ కాంట్రాక్టు, ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. స్విమ్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేత రవి అధ్యక్షతన ధర్నా జరిగింది. ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ప్రసంగిస్తూ స్విమ్స్ ఆసుపత్రి టీటీడీ యాజమాన్యంలోకి వచ్చిన తరువాత కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు గణనీయంగా పెరిగాయని, పని భారం విపరీతంగా పెరిగిందని వేతనాలు పెంచలేదని ఆరోపించారు. గతంతో పోలిక చేస్తే కార్మికులకు కష్టాలు విపరీతంగా పెరిగాయని అన్నారు. మహిళా కార్మికులు తీవ్రమైన ఆవేదన చెందుతున్నారని వివరించారు. ఐఎఎస్ అధికారి పర్యవేక్షణలో ఆస్పత్రి ఉన్నప్పటికీ చట్టవ్యతిరేకంగా కార్మికులను తొలగించడం దారుణమన్నారు. పలుమార్లు తమ సమస్యలు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు టి.సుబ్రమణ్యం, జి.నాగ వెంకటేష్, టి.మునిరాజా, గంగులప్ప పాల్గొన్నారు. జనవరి మొదటివారంలో కార్మికులతో సమావేశం జరిపి నిర్ణయాలు ప్రకటిస్తామని డైరెక్టర్ ఆర్వి కుమార్ తెలిపారు.

తిరుమలలో మళ్లీ చిరుత కలకలం

కెమెరాలకు చిక్కిన చిరుత, ఎలుగుబంటి
భద్రతపై టిటిడి కట్టుదిట్టమైన చర్యలు

ప్రజాశక్తి- తిరుమల



తిరుమల నడక మార్గంలో మళ్లీ చిరుత సంచారం కలవరపెడుతోంది. 6 నెలలుగా ఏడుకొండలు ఎక్కాలంటేనే భక్తులు భయపడుతున్న పరిస్థితి నెలకొంది.6 నెలల క్రితం కౌశిక్ పై చిరుత దాడి, ఆగస్టులో లక్షితను చంపిన చిరుత ఇలా వరుస ఘటనలతో బెంబేలుతున్న భక్తులు ఇప్పుడు తిరిగి నడక మార్గం లో సంచరిస్తుండడం గుబులు రేపుతోంది. చిరుతల భయం లేకుండా టీటీడీ భరోసా ఇస్తుందా, వైల్డ్ లైఫ్ ఆఫ్ ఇండియా ఇచ్చిన మార్గదర్శకాలతో అటవీశాఖ చర్యలు తీసుకుంటుందా అన్నదే ఇప్పుడు ప్రశ్నగా మిగిలింది. తిరుమల నడకమార్గాల్లో చిరుతల భయం భక్తలను ఇప్పట్లో వీడేలా లేదు. చిరుతల సంచారం తగ్గిందంటున్న టిటిడి నడక మార్గాల్లో ఆంక్షలను సడలించింది టిటిడి. ఇప్పుడు తిరిగి నడక మార్గానికి దగ్గర్లోనే సంచరిస్తున్న చిరుతలు, ఎలుగుబంట్ల నుంచి భయాన్ని పోగొట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలియక తల పట్టుకుంటుంది. నడక మార్గాల్లో భక్తులకు కర్రలు ఇస్తున్న టీటీడీ గుంపులు గుంపులుగానే తిరుమల యాత్ర కొనసాగేలా చర్యలు తీసుకుంది. మరోవైపు ఆంక్షలు పూర్తిగా ఎత్తివేసేందుకు అటవీశాఖ అనుమతి తీసుకోవాలని భావిస్తున్న తరుణంలో ఈ నెల 26 నుంచి వరుసగా చిరుత, ఎలుగుబంటి సంచరిస్తుండడం అటవీ శాఖలో ఆందోళన కలిగిస్తుంది. మొదటి ఘాట్ రోడ్ లోని ఎలిఫెంట్ ఆర్చ్ సమీపంలోనే చిరుత, ఎలుగుబంటి సంచారం అటవీశాఖ ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో ఇమేజెస్ క్యాప్చర్ అయ్యాయి.

నరసింహస్వామి ఆలయం సమీపంలోనే చిరుత సంచారం కొనసాగినట్లు అటవీ శాఖ కూడా భావిస్తోంది. ఒకే ఫ్యామిలీకి చెందిన చిరుతలు ఈ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు గుర్తించిన అటవీశాఖ నడక మార్గానికి దగ్గరగా వస్తే బంధించేందుకు ప్రయత్నిస్తోంది. కౌశిక్, లక్షితపై దాడి చేసిన ప్రాంతంలోనే చిరుతల సంచారం కొనసాగుతున్నట్లు గుర్తించిన అటవీశాఖ ఆ ప్రాంతమంతా చిరుతల ఆవాసంగానే భావిస్తుంది.టీటీడీ సహకారంతో నడక మార్గంలో వచ్చే భక్తులకు ఎలాంటి అపాయం తలపెట్టకుండా చేపట్టాల్సిన చర్యలన్నీ తీసుకుంది. ఇప్పటికే ఆరు చిరుతలను బంధించిన అటవీ శాఖ నిరంతర నిఘా కొనసాగిస్తుంది. కావలసినంత సిబ్బందితో అలిపిరి నడక మార్గంలోని ఏడవ మైలు, నరసింహా స్వామి ఆలయం ప్రాంతాల్లో నిఘా కట్టుదిట్టం చేసింది. వైల్డ్ లైఫ్ ఆఫ్ ఇండియా అనుమతిస్తేనే కంచె నిర్మాణం చేపట్టాలా లేక ఇతర చర్యలతో చిరుతల భయం లేకుండా చేయాలా అని ఆలోచిస్తుంది.

ఇక ఏడుకొండల వాడా వెంకటరమణా గోవిందా గోవిందా అంటూ తిరుమల కొండెక్కే భక్తులకు రెండ్రోజుల క్రితం గుర్తించిన చిరుత ఎలుగుబంటి సంచారం భక్తుల వెన్నులో వణుకు పుట్టించింది. ఇప్పటికీ తిరుమల కొండెక్కే భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకొని నడక మార్గంలో తిరుమల యాత్ర కొనసాగిస్తున్న పరిస్థితి ఉండగా ఇప్పుడు తిరిగి కదలిక కంగారు పెట్టిస్తుంది. చిరుతల సంచారం పై నిరంతర నిఘా కొనసాగిస్తున్న అటవీశాఖ అలిపిరి నడక మార్గం, శ్రీవారి మెట్టు మార్గం లో ప్రస్తుతం 300కు పైగానే ట్రాప్ కెమెరాలు, దాదాపు 100 మంది సిబ్బందిని అందుబాటులో ఉంచింది. చిరుతల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ నడకమార్గానికి దగ్గరగా రాకుండా చర్యలు చేపట్టింది. వైల్డ్ లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా కు చెందిన సైంటిస్ట్ టీం అలిపిరి నడక మార్గం, శ్రీవారి మెట్టు మార్గాలలో పర్యటించి చిరుతల సంచారం వల్ల భక్తులకు ఇబ్బంది లేకుండా చేపట్టాల్సిన చర్యలపై సర్వే నిర్వహించింది. ఈ మేరకు క్షేత్రస్థాయి పరిశీలన చేసిన వైల్డ్ లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సైంటిస్ట్ టీం శేషాచలం అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులు నడక మార్గాలు, ఘాట్ రోడ్లను దాటే సమయంలో ఇబ్బంది పడకుండా తీసుకోవలసిన చర్యలు చేపట్టాల్సిన నిర్మాణాలపై కూడా ఆరా తీసి నివేదిక ఇచ్చింది.

అలిపిరి నడక మార్గం, శ్రీవారి మెట్టు మార్గంలో కంచె నిర్మాణం చేపట్ట నుందా లేక ఎలివేటెడ్ వాక్ వే ల నిర్మాణం అవసరమా అన్నదానిపై ఇంకా ఇలాంటి నిర్ణయము తీసుకోలేదు. స్కై వేస్ లాంటి ఓవర్ పాస్ లు, అండర్ పాస్ లపై కూడా చర్చ జరిగినా ఏ ఏ ప్రాంతాల్లో నిర్మించాలన్న దానిపై కూడా ఎక్సపర్ట్స్ టీం పరిశీలించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇచ్చిన నివేదిక ఆధారంగానే టీటీడీ కూడా తిరుమల నడకమార్గాల్లో శాశ్వత ప్రాతిపదికన చిరుతల దాడులకు ఫుల్ స్టాప్ పెట్టాలని భావిస్తోంది. అయితే తరచూ నడక మార్గాల్లో సంచారిస్తూ అతిధుల్లా భక్తులకు కనిపిస్తున్న చిరుతలు ఎలుగుబంట్లు వెన్నులో వణుకు పుట్టిస్తూనే ఉన్నాయి.

యూటీఎఫ్ డైరీ ఆవిష్కరణ




క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: 2024 యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్‌లను ఎంఈవో సరస్వతి, గున్నయ్య, హెచ్‌ఎం రమణయ్య చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శేఖర్, సురేష్ భగవాన్, గౌరవ అధ్యక్షులు రాజమోహన్‌బాబు, బుజ్జిరెడ్డి, కొండలరావు, మునిరాజ, సూర్యనారాయణ, రూపస్, రామారావు, సునీల్, కస్తూరయ్య, తిరుపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో విశేష పర్వదినాలు

ప్రజాశక్తి-తిరుమల: నిత్యకళ్యాణం పచ్చతోరణంగా భాసిల్లుతున్న తిరుమల పుణ్యక్షేత్రంలో జనవరి నెలలో జరుగు విశేష పర్వదినాలు ఇలా ఉన్నాయి. జనవరి 1న శ్రీవారి ఆలయంలో పెద్దశాత్తుమొర, వైకుంఠద్వార దర్శనం ముగింపు, 6న శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాలు ముగింపు, 6న తిరుమల శ్రీవారు తిరుమలనంబి సన్నిధికి వేంచేపు, 7న సర్వఏకాదశి, 9న తొండరడిప్పొడియాళ్వార్ వర్ష తిరునక్షత్రం, 14న భోగిపండుగ, ధనుర్మాసం ముగింపు, 15న మకర సంక్రాంతి, సుప్రభాతసేవ పునఃప్రారంభం, 16న తిరుమల శ్రీవారు పార్వేట మండపానికి వేంచేపు, కనుమ పండగ, 25న శ్రీరామకృష్ణతీర్థ ముక్కోటి, 28న తిరుమొళిశైయాళ్వార్ వర్షతిరునక్షత్రం, జనవరి 31వ తేదిన కూరత్తాళ్వార్ వర్షతిరునక్షత్రం లాంటి పర్వదినాలను టిటిడి వైభవంగా నిర్వహించనుంది.

'ఏపీకి బాబు అవసరం'



ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అభివృద్ధిలో అధఃపాతాళానికి పడిపోయిన ఆంధ్ర ప్రదేశ్‌ని మాజీ సీఎం చంద్రబాబు అవసరం ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు అన్నారు. 'బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా చలపతి నాయుడు శనివారం తొట్టంబేడు గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంచిపెట్టారు. జగన్ పాలనకు, చంద్రబాబు పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమ పాలన కోసం చంద్రబాబు అమలు చేయనున్న ప్రణాళికను విశదీకరించి చెప్పారు. కుమార్‌నాయుడు, విజయ్, పురుషోత్తం నాయుడు, సునీల్ కుమార్, చలమారెడ్డి, లక్ష్మయ్య, జయలక్ష్మి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో శనివారం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట షార్ వారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ అన్నదాన కార్యక్రమానికి లయన్స్ క్లబ్ సభ్యులు లలితారెడ్డి వారి తాత ఎం.వెంగారెడ్డి జ్ఞాపకార్థం జరిపించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆదిశేషారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు శెట్టి, కోశాధికారి అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కెవిబిపురం: మండలంలోని కలత్తూరులో లీలా చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శనివారం తిరుపతి అరవింద ఆసుపత్రి సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో సుమారు 150మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. 20మందికి మందులు, అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లీలా చంద్రారెడ్డి మాట్లాడుతూ తన తండ్రి 77వ జన్మదిన సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి



పంటలను పరిశీలిస్తున్న ఏవో ఖాదర్‌బాషా

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి ఖాదర్ బాషా తెలిపారు. శనివారం ఆయన రైతు పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్ బుకింగ్ ఆధారంగా వైయస్సార్ ఉచిత పంట బీమా, సున్నా వడ్డీ పంట సేకరణ, పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి ప్రభుత్వ పథకాలకు అర్హులు అవుతారన్నారు.

టీటీడీ ఈవోను కలిసిన ఎస్వీయూ వీసీ

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య వి.శ్రీకాంత్‌రెడ్డి టీటీడీ కార్యనిర్వహణాధికారి ఏవీ.ధర్మారెడ్డిని గౌరవ పూర్వకంగా కలిశారు. ఎస్వీయూతో పరస్పర అవగాహనతో ధార్మిక, పరిశోధనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తామని, టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యా సంస్థల అకడమిక్ ప్రోత్సాహంతో ముందుకు సాగుతాయన్నారు.

మానసిక వికలాంగులకు అల్పాహారం పంపిణీ

ప్రజాశక్తి-రేణిగుంట: రేణిగుంట విమానాశ్రయం మార్గంలోని ప్రత్యేక ప్రతిభావంతుల పునరావాస కేంద్రమైన అక్షయ క్షేత్రంలో భగవాన్ శ్రీ శ్రీ రమణ మహర్షి 144వ జయంతిని కురాళ్ల వైసీపీ నాయకులు వేణు మదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం అక్షయ క్షేత్రంలో మానసిక వికలాంగులకు అల్పాహారం పంపిణీ చేశారు. జీపాలెం మాజీ సర్పంచ్ రాజమ్మ మానసిక వికలాంగులకు అరటి పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, సమోసాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో మధు రాయల్, అక్షయ క్షేత్రం నిర్వాహకులు మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్పోర్ట్స్ ఉత్సవ్

ప్రజాశక్తి-రేణిగుంట: పట్టణంలోని డాక్టర్ బషీర్స్ తపస్య పాఠశాలలో స్పోర్ట్స్ ఉత్సవ్ నిర్వహించామని డాక్టర్ బషీర్స్ తపస్య పాఠశాల అధినేత విక్రమ్ శౌరీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత 4 రోజులుగా స్పోర్ట్స్ ఉత్సవం సిఆర్‌ఎస్ మైదానంలో తపస్య పాఠశాలలోని విద్యార్థులను అర్జున, కర్ణ, ద్రోణ, భీష్మ అని 4 విభాగాలుగా విభజించి స్పోర్ట్స్ ఉత్సవం ఘనంగా నిర్వహించామన్నారు. స్పోర్ట్స్ ఈవెంట్‌లో భాగంగా 450మంది విద్యార్థులు 25ఈవెంట్స్ జరిగినట్లు తెలిపారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల చైర్మన్ పలివెళ్ళ బహుమతులు ప్రదానం చేశారు. స్కూల్ చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో 40రోజుల స్పోర్ట్స్ ఉత్సవాన్ని నిర్వహించడం ఒక తపస్యకే సాధ్యమన్నారు.

సరిపడా నిత్యావసరాలు నిల్వ చేయాలి

- పౌర సరఫరాల శాఖ కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: రానున్న నూతన సంవత్సరం జనవరి నెలలో పౌర సరఫరాల సరుకులను ఎండియు వాహనాల ద్వారా మాత్రమే ప్రజలకు సరఫరా చేయాలని అందుకొరకు సరిపడా నిత్యావసర సరుకులను నిల్వ ఉంచుకోవాలని ఆ సంబంధిత అధికారులను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో కమిషనర్ పౌర సరఫరాల శాఖ వారు తిరుపతి జిల్లా జెసి శుభం బన్సల్ తో కలిసి చిత్తూరు, తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కడప, అన్నమయ్య ఐదు జిల్లాల పౌర సరఫరాల శాఖ డిఎస్ఓలు, డి.ఎంలతో ప్రాంతీయ సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రానున్న నూతన సంవత్సరం జనవరి నెలలో నిత్యావసర సరుకులను ఎండియు వాహనాల ద్వారా మాత్రమే ప్రజలకు సరఫరా చేయాలని అందుకొరకు సరిపడా నిత్యావసర సరుకులను నిల్వ ఉంచుకోవాలన్నారు. అలాగే ఏదైనా ఎండియు వాహనాల ఆపరేటర్లు ఖాళీలు ఉంటే వాటిని ఈ నెల ఆఖరి లోపు భర్తీ చేసుకుని ఎండియు వాహనాల ద్వారానే ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ అయ్యేలా సంబంధిత పౌర సరఫరాల శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఎండియు వారి సచివాలయం పరిధిలో కనీసం ఐదు స్థానాలను ఈ నెలాఖరు లోపు గుర్తించాలని, వాటి వద్దనే ఎండియు వాహనాల ఆపరేటర్లు ప్రజా పంపిణీ నిత్యావసర సరుకులను ప్రజలకు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. సంబంధిత వాలంటీర్లు ఆ ఫోటోలను సంబంధిత యాప్‌లో అప్లోడ్ చేయాల్సి ఉంటుందని సూచించారు. రానున్న రోజుల్లో జియో ట్యాగింగ్ లోకేషన్‌లకు వర్తింపచేస్తామని తెలిపారు. జనవరి నెలలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో కంది పప్పు, రాగులు, బియ్యం, చక్కెర తదితర నిత్యావసర సరుకులను తగినంత స్టాక్ నిల్వ ఉంచుకుని కార్డుదారులకు పంపిణీ చేయాలన్నారు. ప్రతి కార్డుదారునికి ఒక కేజి రాగులు పంపిణీ చేయాలని ఆదేశించారు. బియ్యం పక్కదారి పట్టించి సొమ్ము చేసుకునే వారిపై కేసులు పెట్టాలని సూచించారు.

శిల్పారామం వేదికగా బిగ్ ఈవెంట్



పోస్టర్ విడుదల చేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శిల్పారామం వేదికగా న్యూ ఇయర్ వేడుకలు సందర్భంగా ఆదివారం సాయంత్రం బిగ్ ఈవెంట్‌ను యోధా ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు యోగేష్ తెలిపారు. శనివారం ఆయన తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. ఆదివారం సాయంత్రం 7గంటల మొదలు అర్ధరాత్రి 1గంట వరకు న్యూ ఇయర్ వేడుకలు నిర్వహిస్తామన్నారు. అందుకు సంబంధించి పోస్టర్ విడుదల చేశారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ "ది గ్లామరస్ గాలా బజ్" తో తిరుపతి ప్రజలను అలరించడానికి జబర్దస్త్ నూకరాజు బృందం, బిగ్ బాస్ సీజన్ 6 ఫెమ్ ఆర్జె సూర్య ఈవెంట్ పోస్ట్‌గా వ్యవహరించనున్నట్లు తెలిపారు. లైవ్ మ్యూజిక్, కేరళ డ్రమ్స్, ఫ్యాషన్ షో, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్స్ కార్యక్రమాలను నిర్విస్తున్నట్లు చెప్పారు. ఎంట్రీ కోసం రూ.1524 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 9133833399నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రోహిత్, పూర్ణ, ఆసిఫ్, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

కురబలను గుర్తించిన పార్టీకే మద్దతు

- రాష్ట్ర కురబ సంఘం అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు



శ్రీనివాసులును సన్మానిస్తున్న జిల్లా కమిటీ నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సామాజికంగా జనాభా దామాషా ప్రకారం కురబలను గుర్తించిన పార్టీకే తమ మద్దతు ఉంటుందని రాష్ట్ర కురబ సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఈనెల 26న మదనపల్లిలో 536వ భక్త కనకదాసు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి భవిష్యత్తు కార్యచరణపై సంఘం నాయకులతో కలిసి చర్చించామన్నారు. ఏ రాజకీయ పార్టీ అయితే కురుబలకు జనాభా దామాషా ప్రకారం పదవులు ఇస్తుందో వారికే మద్దతు తెలుపుతామన్నారు. 2019 తరువాత వైసీపీ కురుబలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఎమ్మెల్యే, ఎంపీ, మినిస్టర్ స్థానిక సంస్థల్లో కూడా ప్రధాన్యమిచ్చారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కురుబ సామాజిక వర్గానికి సంబంధించిన వారిలో రాజకీయ చైతన్యం కల్పించడానికి కుప్పం నుండి కర్నూలు, ఒంగోలు నుండి గోదావరి జిల్లాల పరిధిలో కురుబ, కురుమ, కురువ నాయకులతో కలిసి రాజకీయ చైతన్య యాత్రను నిర్వహించనున్నామన్నారు. తిరుపతిలో కురుబకుల సంక్షేమ భవనానికి 5 ఎకరాల స్థలం, ఐదు కోట్ల నిధులను మంజూరు చేయాలని ఇప్పటికే ప్రభుత్వానికి వినతి ఇవ్వడం జరిగిందన్నారు. అంతకుముందు తిరుపతి జిల్లా అధ్యక్షులు మంగిరి రెడ్డెప్ప మాట్లాడుతూ మూడవసారి రాష్ట్ర అధ్యక్షులుగా జబ్బల శ్రీనివాసులు ఎన్నికవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రెడ్డి కుమార్, రాష్ట్ర యువత వర్కింగ్ ప్రెసిడెంట్ గుండ్లూరు శ్రీనివాసులు, గుడి ఆదినారాయణ, రుయా మల్లి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధించాలి

- సీనియర్ సివిల్ జడ్జి రాఘువేంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాఘువేంద్ర

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: తల్లిదండ్రులు పిల్లలను మానవ అక్రమ రవాణా, కల్తీ ఆహారం నుండి రక్షించుకోవాలని పుత్తూరు మండలి న్యాయ సేవ అధికారి సమస్త అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సి రాఘువేంద్ర పేర్కొన్నారు. స్థానిక శేష సాయి పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ కల్తీ ఆహార, మానవ అక్రమ రవాణా నిరోధించాలన్నారు. పిల్లలు నిల్వ ఉంచబడిన ఆహారాలను తీసుకోకూడదన్నారు. ఫాస్ట్ ఫుడ్ తినకుండా ఉండేందుకు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. కిడ్నీ మార్పులు చేసేందుకు పిల్లలను టార్గెట్ చేస్తారని జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం పుత్తూరు జూనియర్ సివిల్ జడ్జి జానకి మాట్లాడుతూ పిల్లలు ఇంటి నుంచి ఒంటరిగా వెళ్లకూడదని, తల్లిదండ్రులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది లక్ష్మీపతి, మురుగేషన్ రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ ఇంద్రజిత్తు, ఏవో భాను మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధ్యాపకుల ఉద్యోగోన్నతి వెంటనే చేపట్టాలి

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీయూ నూతన ఉప కులపతిగా నియమితులైన ఆచార్య వి. శ్రీకాంత్ రెడ్డిని ఏబిఆర్‌ఎస్‌ఎం రాష్ట్ర శాఖ తరపున శనివారం వైస్‌ఛాన్సలర్ కార్యాలయంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్వీయూలో గత రెండు సంవత్సరాలుగా కెరియర్ అడ్వాన్సుడ్ స్కీం ప్రమోషన్స్ చేపట్టలేదని దాదాపు 100మంది అధ్యాపకులు ఉద్యోగోన్నతి కోసం వేచి చూస్తున్నారని, కావున వెంటనే అర్హులైన అధ్యాపకులందరికీ సిఎఎస్ ద్వారా ఉద్యోగోన్నతి కల్పించాలని ఏబిఆర్‌ఎస్‌ఎం తరపున విజ్ఞప్తి చేశారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ వీలైనంత తొందరలో ఉద్యోగోన్నతి ప్రక్రియ చేపడతామని అధ్యాపకులు అందరికీ న్యాయం చేస్తామన్నారు. రాబోయే రోజులలో ఎస్వీయూ అభివృద్ధికి ఏబిఆర్‌ఎస్‌ఎం తరపున తమ సహాయ సహకారాలను అందిస్తామని రాష్ట్ర శాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి.రామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ప్రొఫెసర్ ఎం.రాజశేఖర్, టిటిడి విద్యాసంస్థల ఇన్చార్జ్ డాక్టర్ వి.పద్మావతమ్మ, ప్రతినిధులు డాక్టర్ రంజని, డాక్టర్ జయచంద్రరెడ్డి, డాక్టర్ రమేష్, డాక్టర్ మంజునాథ్, డాక్టర్ షణ్ముఖ పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: ఎస్టీ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని దళిత, గిరిజన జిల్లా అధ్యక్షులు వై.నందయ్య పేర్కొన్నారు. పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం మజ్జిగుంట ఎస్టీ కాలనీలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మజ్జికుంట ఎస్టీ కాలనీలో నీటి సమస్యలు. స్మశాన వాటికలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. డ్రైనేజీ కాలువలు లేని చోట ఏర్పాటు చేయాలని ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ గోడలు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలన్నారు. ఇండ్లు లేని వారికి ఇంటి స్థలాలు కేటాయించి పట్టాలు ఇవ్వాలని, భూమిలేని వారికి భూ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మజ్జిగుంట జగనన్న ఎస్టి కాలనీలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ కె.భాస్కర్, వీఆర్వో సాయి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ చైతన్య, వెలుగు సిసి గోపి, పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ వహించాలి

- సోషల్ సైన్సెస్ హ్యూమానిటీస్ డీన్ ఆచార్య కె.అనురాధ



సమావేశంలో మాట్లాడుతున్న డీన్

ప్రజాశక్తి-క్యాంపస్: మహిళలు ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ వహించాలని సోషల్ సైన్సెస్ హ్యూమానిటీస్ డీన్ ఆచార్య కె.అనురాధ సూచించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఉమెన్ స్టడీస్, న్యాయవిభాగం, నేషనల్ కమిషన్ ఫర్ వుమెన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు శనివారం ముగిసింది. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారై మాట్లాడారు. మహిళలు శారీరకంగా ఆరోగ్యవంతంగా ఉంటే మానసికంగా కూడా బలంగా, దృఢంగా సిద్ధమవుచ్చని పేర్కొన్నారు. మహిళలు మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే శారీరక ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మహిళా సాధికారత కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెట్టాయని వెల్లడించారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్లు డాక్టర్ నీరజ, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, డాక్టర్ శ్రీరజిని, ఆచార్య సుజాతమ్మ, ఆచార్య శారద, ఆచార్య సావిత్రి, ఆచార్య సీతాకుమారి, ఆచార్య ఆముదవల్లి, ఆచార్య నిర్మల, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిసిడీఈ కార్యక్రమాలపై నివేదిక పుస్తక ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీయూలోని బిసిడిఈ కోఆర్డినేటర్ ఆచార్య కే.సుధారాణి ఆధ్వర్యంలో బీసీడీఈ కార్యక్రమాల నివేదిక పుస్తకాన్ని శనివారం విసి చాంబర్లో ఉపకులపతి ఆచార్య వంగిమల్ల శ్రీకాంత్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఓఎమ్డి హుస్సేన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్వీయూ బీసీడీఈ కోఆర్డినేటర్ ఆచార్య కే.సుధారాణి బీసీడీఈ ఏర్పాటు దాని ఆవశ్యకత గురించి ఎన్ఈపి-2020 నిర్దేశించిన సూచనలు ప్రకారం విద్యార్థులను సమాజంలో భాగస్వాములు చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని వివరించారు. ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి రాష్ట్రస్థాయిలో బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్మెంట్ త్రు ఎడ్యుకేషన్ ఏర్పాటు చేసిందన్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థులందరిని సమాజాభివృద్ధిలో కార్యక్రమాలలో భాగస్వాములుగా చేయడం దీని ముఖ్య ఉద్దేశం అన్నారు. విసి ఆచార్య వి.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను సమాజసేవలో భాగస్వాములు చేసే వివిధ కార్యక్రమాలను ఒక పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో విద్యార్థులను సమాజ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో బిసిడిఈ అంబాసిడర్స్ డి.రమణ, డి.రాజరాజేశ్వరి, కే.శ్రీలత కిషోరి, వి.జగదీశ్వరి, పి.సునీత పాల్గొన్నారు.

చేనేత సమస్యలపై చంద్రబాబుకు వినతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర వ్యాప్తంగా చేనేతలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని సమస్యలను ఆలకించి అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరించాలని కోరుతూ జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సుంకర చిన్నరెడ్డిబాబు ఆధ్వర్యంలో మాజీ సీఎం చంద్రబాబుని కలిసి శనివారం కుప్పంలో వినతి ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 ఉప కులాలుగా ఉన్న చేనేతల జనాభా దాదాపు కోటికి పైగా ఉన్నామన్నారు. చేనేత వృత్తినే నమ్ముకొని జీవిస్తున్నామని, పట్టు, నూలు, జరీ రేట్లు విపరీతంగా పెరిగిన కారణంగా మగ్గాలు జరగక, పనులు లేక చేసిన అప్పులు తీర్చుకోలేక అనేకమంది నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసి నేతన్ననేస్తం పథకం పేరుతో అనేక షరుతులు పెట్టి 24వేలు రూపాయలు రాష్ట్ర వ్యాప్తంగా 61 వేల మందికి మాత్రమే ఇస్తున్నారని బాబుకి తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చేనేతల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాన కార్యదర్శి సిబ్బాల వెంకటరమణ, కార్యదర్శి ముద్దుశెట్టి శ్రీనివాసులు, కోశాధికారి శిబ్బాల రమేష్ పాల్గొన్నారు.

హామీల నెరవేర్చడంలో జగన్ ఫెయిల్

ప్రజాశక్తి-గూడూరుటౌన్: గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో సీఎం జగన్ ఫెయిల్ అయ్యారని టీడీపీ రాష్ట్ర కమిటీ నాయకులు శీలం కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం గూడూరు పట్టణ టీడీపీ కార్యాలయంలో హామీల అమల్లో 85శాతం ఫెయిల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ 730హామీలు ఇవ్వగా అందులో కేవలం 21మాత్రమే నెరవేర్చారని, 85శాతం అమలు చేయలేదన్నారు. గూడూరు మున్సిపాలిటీకి త్రాగునీటి సరఫరా కోసం రూ.18 కోట్ల నిధులతో చేపట్టిన పనులను కూడా వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించారు. కావున టిడిపి నాయకులు, కార్యకర్తలు వైసిపి మోసాలపై ప్రజలకు వివరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, ఇజ్రాయిల్ కుమార్ , రవీందర్ రెడ్డి, రహీం, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



బహుమతులు అందజేస్తున్న డాలర్స్ అధినేత

ప్రజాశక్తి-క్యాంపస్: మహిళ వర్సిటీలో వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. విశ్వవిద్యాలయాల వాలీబాల్ వుమెన్ టోర్నమెంట్ ఈ నెల 27 నుండి 31 వరకు జరుగుతున్నాయి. 4వ రోజు స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ హ్యూమానిటీస్ అండ్ మేనేజ్మెంట్ డీన్ ప్రొఫెసర్ అనురాధ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకొని వారికి అభినందనలు తెలిపారు. డాలస్ గ్రూపు చైర్మన్ డాక్టర్ సి. దివాకర్ రెడ్డి టోర్నమెంట్ స్పాన్సర్ ముఖ్య అతిథిగా విచ్చేసి లీగ్ టోర్నమెంటులో ఆడబోవు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. వర్సిటీ మాజీ రిజిస్టర్ ప్రొఫెసర్ డిఎం. మమత మరొక కోర్టులో జరుగుతున్నటువంటి మ్యాచ్ క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి అభినందనలు తెలిపారు.

అంకురాలో అరుదైన శస్త్ర చికిత్స.. సక్సెస్



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: అంకుర ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆ ఆసుపత్రి మెడికల్ సూపరెంటెంట్ డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. స్థానిక రేణిగుంట రోడ్డులోని అంకుర ఆసుపత్రుల్లో శనివారం అయిన విలేకరితో మాట్లాడుతూ కడప జిల్లాకు చెందిన ఆరిఫ్ అలీ కుమారుడు ఫౌజ్జన్ అహ్మద్ (10)స్కూల్లో ఆడుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు ఓ పదునైన పిన్నులను మింగేశాడన్నారు. వెంటనే స్కూల్స్ సిబ్బంది కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, కడపలోని రెండు, మూడు ఆసుపత్రులను సంప్రదించారు. అక్కడ వైద్యులు దీనికి చికిత్స అందించడం తమవల్ల కాదని చెప్పడంతో, తెలిసినవారు సహాయంతో తిరుపతిలోని అంకుర ఆసుపత్రిని సందర్శించారు. ఇక్కడ పలమనాలజిస్ట్ డాక్టర్ నరసింహ, పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ విటల్ మోహన్ ఆధ్వర్యంలో వైద్య బృందం, ఆ బాలుడికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బాబు పొరపాటున మింగేసిన పిన్ను ఊపిరితిత్తుల్లోని వాయునాలానికి అడ్డంగా ఇరుక్కుపోవడాని గమనించారు. వెను వెంటనే అప్రమత్తమై బాలుడికి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించి, బాలుడు ప్రాణాలను కాపాడినట్లు తెలిపారు. ఇలాంటి అరుదైన శస్త్ర చికిత్సలు కూడా అంకుర ఆసుపత్రులు విజయవంతంగా నిర్వహిస్తున్నమన్నారు. అనుభవిజనులైన, అంకితభావం గల అన్ని విభాగాలకు చెందిన వైద్యబృందం ఉండడంతో అరుదైన శస్త్ర చికిత్సలను కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. బాధితుడు తండ్రి ఆరిఫ్ ఆలీ మాట్లాడుతూ తమ బిడ్డకు ప్రాణం బిక్ష పెట్టిన అంకుర ఆసుపత్రి వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ విటల్ మోహన్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ దినేష్, డాక్టర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆ చట్టాలు భూస్వాములకు మేలు చేయడానికా.?

- ఎఐకెఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-గూడూరుటౌన్: అసైన్డ్ భూముల చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం సవరించి భూస్వాములు, పెత్తందార్లకు మేలు చేయాలని చూస్తోందని ఎఐకెఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పట్టనంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో అఖిల భారత రైతు కూలీ సంఘం మూడవ మహాసభ డీపీ పోలయ్య అధ్యక్షతన జరిగింది. ముందుగా జెండాను ఆవిష్కరించారు. ఆ తరువాత సమావేశంలో చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా ఎన్నో పోరాటాలతో పేదలు పోరాడి సాధించుకున్న అసైన్డ్ భూముల చట్ట సవరణను ఉప సంహరించుకునేంత వరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. దళితులు, గిరిజనులను వైకాపా ప్రభుత్వం మోసం చేస్తోందని వారు వివరించారు. సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మహాసభలో రాష్ట్ర నాయకులు నాంచార్లు, సీ.ఎస్ సాగర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఎర్రచందనం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలు, నిందితులు, దుంగలను చూపుతున్న అధికారులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమల అటవీ ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు అటవీశాఖ క్షేత్రస్థాయి అధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మీడియాకు వివరాలను వెల్లడించారు. శనివారం తిరుమలలోని మావిళ్ళ మంద ప్రదేశం వద్ద రెండు వాహనాలలో ఎర్ర చందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న 9మంది స్మగ్లర్లని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. వారి వద్ద 15 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఘటనలో ఇద్దరు స్మగ్లర్లు తప్పించుకొని పారిపోయినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న 15 దుంగల బరువు 463 కేజీలుగా ఉన్నాయని, విలువ రూ.9 లక్షల ఉంటుందన్నారు. కారుతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడులలో ఎఫ్ఆర్ఓ చెంచులక్ష్మి, ఎఫ్‌బిఓ మురళి, బేస్ క్యాంపు నిఘా సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - కేవీబీపురం: మండలంలోని కొండల ఆదవారం గ్రామంలో అక్రమ మద్యం విక్రేతను అరెస్ట్ చేసినట్లు ఏఎస్ఐ లోకనాథ తెలిపారు. శనివారం ఆయన మీడియాకు వివరాలను వెల్లడించారు. కొండల ఆదవారం బస్టాండ్ వద్ద విక్రేత భాస్కర్‌ను అదుపులోకి తీసుకొని 14 మద్యం బాట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

40మందిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని 28 పంచాయతీలకు చెందిన 40మందిని పోలీసులు బైండోవర్ చేసినట్లు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు. శనివారం డిప్యూటి తహశీల్దార్ చంద్రబాబు నాయుడు ఎదుట ఆ 40మందిని హాజరుపరిచారు. కాగా రాబోవు ఎన్నికల్లో ఎలాంటి శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదని వారిని బైండోవర్ చేసుకున్నారు. అల్లర్లు, గొడవలకు ప్రేరేపిస్తే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ పలు సూచనలు చేశారు.

రామకృష్ణారెడ్డికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-క్యాంపస్: ప్రముఖ విద్యావేత్త, ఆర్కే అబాకస్ ఛైర్మన్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్శిటి(ఐఏఓ) ఆధ్వర్యంలో హోసూర్‌లో ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం అట్టహాసంగా జరిగింది. విద్యారంగంలో ఆయన చేసిన విశిష్ట సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. రామకృష్ణారెడ్డిని పలువురు విద్యావేత్తలు, పారిశ్రామిక, రాజకీయ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

వాటర్ బాడీ గణనపై సమీక్ష

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: 'వాటర్‌బాడీ' గణనపై క్షుణ్ణంగా పరిశీలించి లెక్కలు తేల్చాలని ప్లానింగ్ డిపార్టుమెంట్ అక్సిడెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. శనివారం ఉదయం తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒల సమక్షంలో ఈ సమీక్ష సమావేశం జరిగింది. విఆర్‌ఒలు తహశీల్దార్ కార్యాలయం రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, మండలంలో ప్రతి పంచాయతీలో ఒక్కచెరువు, గుంట తప్పిపోకుండా పరిశీలించాలని, ఎలాంటి రాజకీయాలకు తావివ్వకుండా చూడాలన్నారు. పరిశీలించిన వివరాలను రికార్డు పరంగా ఎలా ఉన్నాయో వాటి పురోగతిని రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ యూనియన్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ రంగయ్య, రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్

తిరుపతి టౌన్ : నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం సాయంత్రం యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను కమిషనర్ డి.హరిత ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వై.హేమాద్రిబాబు, ఎస్.ఖాదర్‌బాషా, బండి మధుసూదన్‌రెడ్డి, జి.మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే చర్యలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: న్యూయర్ సందర్భంగా అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ విక్రమ్ హెచ్చరించారు. శాంతియుతంగా న్యూ ఇయర్ నిర్వహించాలన్నారు.